క్లుప్తంగా

30 వేల క్యూసెక్కుల నీటి విడుదల


బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. ఈ నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జీఎన్ఎస్ఎస్‌కు 14 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 4 వేల క్యూసెక్కులు, తెలుగుగంగ (వీబీఆర్)కు 12 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

1,337 క్యూసెక్కుల నీటి విడుదల


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పుల వాగుకు 1,337 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,638 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు చెప్పారు. ఈ నీటిని నిప్పులవాగుకు 1,337 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 246 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

దేవదాయ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు


శ్రీశైలం ముఖ ద్వారం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ

శ్రీశైలం: దేవాదాయ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ జి. ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం శ్రీశైలం ముఖద్వారం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. శ్రీశైల క్షేత్రంలోకి మాంసం, మద్యం రాకుండా కట్టడి చేశారు. వాహనాలకు సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐ గురవయ్య, పీసీలు రఘునాథ్, బాలకృష్ణ, మహేష్, శివ మహేంద్రరెడ్డి, నాను నాయక్ ఉన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, తోటమద్దు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్షన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12, 14 జీవోలను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం నంద్యాలకు సమీపంలో ఇసుకరీచ్‌లను ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం ఇసుక అందని ద్రాక్షలా మారిందని అన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. అనంతరం ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మున్నా, కార్యదర్శుడిగా ఇంతియాజ్, ఉపాధ్యక్షుడిగా రహిమాన్, సహాయ కార్యదర్శులుగా షబ్బీర్, ఇలియాస్, మహబూబ్‌బాషాలతో పాటు 12మందిని ఎన్నుకున్నారు.

ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ పెంచాలి



పట్టణానికి దూరంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ తప్పనిసరిగా పెంచాలి. ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో తెలియని పరిస్థితి ఉంది. విజిటర్స్ మీద ప్రణాళికబద్ధమైన నియంత్రణ అవసరం. ప్రభుత్వ వైద్యశాలలో నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులు, హెడ్ నర్సులు, స్టాఫ్, నర్సులు, ఏఎన్ఎంలకు రక్షణ కల్పించాలి. రాత్రిపూట పట్టణ శివారులో ఉన్న వైద్యశాలలో డ్యూటీ చేయాలంటే భయపడుతున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి పూట పోలీసు పెట్రోలింగ్ పెంచాలి.

– డాక్టర్ ఎస్.శ్వేత గైనకాలజిస్ట్, నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాల



డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి



ప్రభుత్వాలు మహిళా డాక్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా డాక్టర్‌పై అఘాయిత్యం జరగడం చాలా బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులకు కఠిన శిక్షలు విధించాలి. మహిళా డాక్టర్ల రక్షణ కోసం వారు విధులు నిర్వర్తించేచోట దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గది, మూత్రశాలలు, వైద్యశాలల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాలి. వైద్యశాలల వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ తప్పకుండా ఉండాలి.

– దీపానాగవేణి, వైద్యురాలు, పీహెచ్‌సీ, కొత్తపల్లి

రేపు మండల సర్వసభ్య సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు (ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ) హాజరుకావాలని కోరారు.

అక్షరమాల నేర్పేదెప్పుడో!

- అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు ఇవ్వని ప్రభుత్వం
- పాత పుస్తకాలతో తూతూమంత్రంగా బోధన
- ప్రైవేట్ స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు


నందికొట్కూరు పట్టణంలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్


పాత పుస్తకాలతో చదువుకుంటున్న చిన్నారులు

నందికొట్కూరు: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా సాగిన విద్యా వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు గడిచినా కనీసం అంగన్‌వాడీ పిల్లలకు పాఠ్య పుస్తకాలు అందించ లేదు. గత ప్రభుత్వంలో జూన్ నెలలోనే అంగన్‌వాడీల్లోని చిన్నారుల చేతికి కొత్త పాఠ్యపుస్తకాల కిట్‌లు అందేవి. ఈ ఏడాది కొత్త ప్రభుత్వ పాలనలో విద్యాసంవత్సరం ప్రారంభమై ముచ్చటగా మూడో నెలలో అడుగుపెట్టినా ఇంత వరకు పిల్లలకు కొత్త పుస్తకాలు రాకపోవడంతో పిల్లలకు అక్షరమాల నేర్పించేందుకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దిక్కుతోచని స్థితిలో గతేడాది పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలతోనే అంగన్‌వాడీ టీచర్లు బోధన చేస్తున్నారు.

బాల్య దశ నుంచి చిన్న పిల్లలకు ఆయా అంశాలపై అవగాహన కల్పించేందుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక చర్యలు తీసుకుంది. తత్ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లోకి పిల్లలు వచ్చేలా, బడి పట్ల ఆసక్తి కలిగేలా ఆటపాటలతో కూడిన విద్య, బొమ్మలున్న పుస్తకాలు అందజేసింది. ఫలితంగా పిల్లలు ఎంతో ఉత్సాహంగా అంగన్‌వాడీ కేంద్రాల బాట పట్టారు.

- జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు -1663
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు -1,23,415
- ప్రీస్కూల్ పిల్లలు మొత్తం - 49,979

అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఏడాది అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలు ఇప్పటివరకు అందించలేదు. పాత పాఠ్య పుస్తకాలతోనే కాలం గడిపేయాలనే అనధికార ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది సైతం చేసేది ఏమీ లేక పాత పుస్తకాలతోనే పిల్లలకు అక్షరాలు, పదాలు, నంబర్లు వంటివి బోధిస్తున్నారు.

జిల్లాలోని 6 ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 6 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు-73,436, ప్రీస్కూల్ పిల్లలు-49,979 మంది పిల్లలు ఉన్నారు.

జూన్‌లో రావాల్సిన పాఠ్య పుస్తకాలు ఇప్పటికీ రాలేదు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లీషు, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు, పీపీ-2 కిట్లు అందించేవారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు బొమ్మలతో కూడిన పుస్తకాలను చూపిస్తూ చిన్నారులకు విద్యను బోధించడం సులువుగా ఉండేది. పిల్లలు కూడా ఆసక్తిగా పాఠాలు నేర్చుకునే వారు. అంగన్‌వాడీల్లో ఇంగ్లిషు విద్యాబోధన చిన్ననాటి నుంచే జరుగుతుండటంతో ఠంచనుగా అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్య బోధన తూతూ మంత్రంగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో లేదో అన్న సందేహంతో పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు.

పాత పుస్తకాలతోనే బోధన



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాదికి సంబంధించిన కొత్త పాఠ్య పుస్తకాలు ఇంకా అందించలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు సరఫరా చేస్తాం. ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పాఠ్య పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం. ప్రతి రోజు టైం టేబుల్ ప్రకారం అన్ని కేంద్రాల్లో చిన్నారులకు విద్యా బోధన జరుగుతుంది.

– నిర్మల, ఐసీడీఎస్ పీడీ, నంద్యాల జిల్లా

కొత్త పుస్తకాలు ఇవ్వలేదు



ఈ సంవత్సరం ఎప్పటివరకూ పిల్లలకు కొత్త పుస్తకాలు ఇవ్వలేదు. మా పిల్లలు పాత పుస్తకాలతోనే చదువుకుంటున్నారు. అంగన్‌వాడీ టీచర్లు పాత పుస్తకాలతోనే పాఠాలు నేర్పిస్తున్నారు. గతంలో జూన్ నెలలోనే కొత్త పుస్తకాలు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు నెలలవుతున్నా ప్రభుత్వం కొత్త పుస్తకాలు ఇవ్వలేదు. – చెన్నమ్మ, నందికొట్కూరు పట్టణం

ప్రైవేట్ స్కూలుకు పంపుతున్నాం



అంగన్‌వాడీ స్కూళ్లలో కొత్త పుస్తకాలు ఇవ్వకపోవడంతో మా పిల్లలను జూలై ఆఖరి నుంచి ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు వచ్చిన 'అ' 'ఆ' లు రావు, 'ఏబీసీడీ'లు రావు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలలకు పంపించాల్సిన పరిస్థితి.

– మమత, జీ.వీరాపురం, కొత్తపల్లి మండలం

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్నరాయలసీమ కో-ఆర్డినేటర్ శేషఫణి యాదవ్

ఆత్మకూరు: యాదవులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కో-ఆర్డినేటర్ శేషఫణి యాదవ్ అన్నారు. పట్టణంలోని థెరీసా జూనియర్ కాలేజీలో ఆదివారం అఖిలభారత యాదవ్ మహాసభ ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బాలస్వామి యాదవ్ అధ్యక్షత వహించారు. శ్రీకృష్ణుడికి పుష్పాలంకరణ చేసి పూజ చేశారు. బి.పి.మండల్ 106వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి బీసీలకు ఆయన కల్పించిన రిజర్వేషన్‌ల గురించి జిల్లా నాయకుడు రఘురాముడు యాదవ్ వివరించారు. అనంతరం యాదవ సంఘం నాయకుడు జయకృష్ణను కాటమరాజుయాదవ్ భూ సాధనసమితి రాయలసీమ కో-ఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు. కాటంరాజు యాదవ భూసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చింతల మోహన్‌రావు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సింధూ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత బీమా కల్పించాలి


మాట్లాడుతున్న నాగాంజనేయులు

జూపాడుబంగ్లా: చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి మత్స్యకారుడికి ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఏపీ మత్స్యకార కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగానాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన ప్రతి మత్స్యకారుడికి రాయితీపై బోట్లు, వలలు, ద్విచక్రవాహనాలు, ఐస్‌బాక్సులు, ఫోర్‌వీలర్స్ వంటివి మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. చేపలను గిట్టుబాటు ధరలకు విక్రయించేలా నందికొట్కూరులో ఫిష్‌యార్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐస్ ప్లాంటు ఏర్పాటుచేసి తక్కువ ధరకు ఐస్ అందించాలని, చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందేలా ఉచిత బీమా కల్పించాలన్నారు. వేసవిలో మత్స్యకార కుటుంబాలకు నెలకు రూ.10 వేలు భృతి అందించాలని కోరారు. రాష్ట్రంలో 28 రకాల చేతివృత్తిలపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు భద్రత కల్పించి ప్రోత్సహించాలని కోరారు. సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, నాగన్న, రమణ, పెద్దనాగన్న, శంకర్, కదింబియా, సాంబ, చాంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక


ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

నందికొట్కూరు: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా అల్వాల బాలయ్య, అధ్యక్షుడిగా బద్దుల శ్రీధర్, గౌరవ సలహాదారుడిగా భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, కృష్ణారెడ్డి, రంగస్వామి, ప్రధాన కార్యదర్శిగా భానుప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, రవికుమార్‌రెడ్డి, వేణు, రవి, శ్రీకాంత్‌గౌడు, ఆర్ట్ శ్రీను, జేపీ రవికుమార్, జయన్న, సురేష్, రాజశేఖర్, కోశాధికారి శేఖర్, న్యాయ సలహాదారులుగా సత్యనారాయణ, వెంకటరాముడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినాయక మండపాల నిర్వాహకులతో మండపాల ఏర్పాటు ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాలపై చర్చించారు.

నేడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

మిడుతూరు: స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో భూమిని శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో అధికారులు అవినీతిలో కూరుకొని పోయారన్నారు. పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఊసే లేదన్నారు. చిన్నపాటి వర్షానికే నీరు రహదారుల్లో నిలిచిపోతుండటంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అక్టోబర్‌లో మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 49 మందికి ఉద్యోగాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంకు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 49 మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగులు ఈ మేళాలో పాల్గొన్నారన్నారు. నిరుద్యోగుల కోసం భవిష్యత్తులో మరెన్నో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత సాధించిన వారిని వెంకటేశ్వర జూనియర్ కళాశాల యాజమాన్యం అభినందించింది.

నాటుసారా తయారు చేస్తే జైలుకే..

- వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- 50 లీటర్ల నాటు సారా స్వాధీనం, బైక్ సీజ్


నీలిషికారిపేటలో స్వాధీనం చేసుకున్న నాటుసారా, సామగ్రితో పోలీసులు

నందికొట్కూరు: ఎవరైనా నాటుసారా తయారు చేస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. పట్టణంలోని నీలిషికారిపేటలో ఆదివారం కార్డెన్ సెర్చ్, నాకబందీ కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఒక బైక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటుసారా తయారు చేయడం తగదన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేసి జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు సురేష్‌బాబు, లక్ష్మినారాయణ, ఓబులేసు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రేతల అరెస్ట్

పగిడ్యాల: ధనార్జన ధ్యేయంగా అడ్డదారులు తొక్కుతూ తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నెహ్రూనగర్ కేసీ కెనాల్ బ్రిడ్జి సమీపాన తెలంగాణ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి కుమ్మరి ఉసేన్, ఈడిగ లక్ష్మిదేవమ్మను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి ఇంపీరియల్ బ్లూ 180 ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. అలాగే కృష్ణానది పరివాహక గ్రామాలైన పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, ప్రాతకోట, ఎం.ఎస్.ఘణపురం తదితర గ్రామాలపై పోలీస్ నిఘా ఉంచామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవ్వరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితులు శ్రీశైలం బ్యాక్‌వాటర్ మీదుగా ఇంజిన్ బోట్లలో అర్లపాడు ఘాట్ నుంచి తెలంగాణ రాష్ట్రం చెన్నంబావి గ్రామానికి వెళ్లి మద్యం తెస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిఘా వేసి పట్టుకున్నామని ఎస్ఐ వివరించారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకుంటాం


మాట్లాడుతున్న సీపీఐ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకుంటామని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని వాల్మీక్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అంగీకరించబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట తప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ చెప్పినట్లు రాష్ట్ర ప్రభుత్వం తలాడించడం సిగ్గు చేటని విమర్శించారు. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్ణయాన్ని వ్యతిరేకించడమే గాకుండా, హైకోర్టులో కేసులు వేసింది టీడీపీ కాదా అని ప్రశ్నించారు. గతంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన టీడీపీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశాలివ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 2022 విద్యుత్ చట్టాన్ని అమలు చేయాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తే రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ, రైతు సంఘం నాయకులు సుధాకర్, స్వామన్న, రామకృష్ణ, రాజు, స్వాములు, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజానికి పాల్పడితే తాట తీస్తా


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

నందికొట్కూరు: పట్టణంలో రౌడీయిజానికి పాల్పడితే తాట తీస్తానని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆదివారం టౌన్ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లలో మార్పు రావాలన్నారు. రౌడీయిజం వదిలేసి ప్రజా జీవనం గడపాలని సూచించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రౌడీషీటర్లపై పీడీ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు. మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

పాములపాడు: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. ఘర్షణలు, అల్లర్లకు దూరంగా ఉండాలని చెప్పారు. మీరు చేసే పనులు మీ పిల్లలపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరితో మంచిగా ఉంటూ కుటుంబ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 1976 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో కలిశారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. భవిష్యత్తులో వృద్ధాశ్రమాలకు చేయూతనందించడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు పూర్వ విద్యార్థి, రిటైర్డు ఎంఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

ఆలయ భూమి అయితే ఇంటికి బిల్లు ఎలా ఇచ్చారు?


ఆధారాలు చూపుతున్న బాధితులు

బొమ్మలసత్రం: చంద్రబాబునాయుడు 2017లో ప్రవేశ పెట్టిన చుక్కల భూములకు సంబంధించిన జీవో కారణంగానే తాను ఇల్లు కోల్పోయానని మహానంది ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమి తాలూకు బాధితుడు బాలతిమ్మయ్య వాపోయారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న స్థలం మహానంది ఆలయానికి చెందుతుందని ఇటీవల ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆ స్థలంలోని ప్లాట్లలో నిర్మించిన భవనాలను కూల్చివేసేందుకు ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అక్కడ ప్లాట్లు కలిగిన వారు చంద్రబాబు తీసుకొచ్చిన జీవోతోనే తమ స్థలం ఆలయభూమిలో చేరిందని, కొలతలు వేసి సర్వేనంబర్ 2247నుంచి తమ ప్లాట్లు వేరు చేయాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని ఆదివారం విలేకరుల ఎదుట వాపోయారు. 2016లో చంద్రబాబు పాలనలోనే బాలతిమ్మయ్య గృహాన్ని నిర్మించుకున్నారని..దేవాలయం స్థలం అయితే, అక్కడ గృహనిర్మాణానికి బిల్లులు ఎలా మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.